కథ

డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

# అమ్మ సమస్య

"ఉదయం ఆరు గంటలయింది లేవండోయ్" అంటూ గడియారంలోని 'కుకూ' పక్షి హెచ్చరింపుతో మెలకువ వచ్చిన శమంత బద్ధకంగా కదిలింది.

పక్కనే గాఢ నిద్రలోవున్న సుధీర్‌ని చూస్తే కాస్త అసూయ కలిగిందామెకు. తన మనసు, శరీరం రెండూ గడియారం చప్పుళ్ళకి ట్యూన్ అయిపోబట్టేనేమో ఆదివారం కూడా ఆరింటికే 'కుకూ' శబ్దానికి మేలుకుంటుంది.

'కానీ పాపం సుధీర్ రాత్రి ఒంటి గంటదాకా కంప్యూటర్‌కే అంకితమైపోతాడు. ఎప్పుడూ ప్రాజెక్ట్ డెడ్‌లైన్స్, క్రొత్త ప్రాజెక్ట్స్ గురించిన ప్లాన్స్ అంటూ సతమతమవుతుంటాడు' అని గుర్తుకు రాగానే భర్తకు నిద్రాభంగం కాకుండా నెమ్మదిగా మంచం దిగి గది తలుపు దగ్గరగా వేసి హాల్లోకి వచ్చింది.

పక్క గదిలో గాఢ నిద్రలో వున్న పదేళ్ళ సాయి ముద్దు ముఖంలోకి చూస్తే నిద్రలేపబుద్ధి పుట్టలేదు శమంతకు.

కానీ తప్పదు... వాడు ఏడున్నరకల్లా స్కూలుకి సిద్ధం కావాలి. "నాన్నా సాయీ! లేమ్మా" అంటూ వాడి జుట్టు సవరిస్తూ పిలిచింది.

"అప్పుడే ఆరయిందా అమ్మా? ప్లీజ్ ఇంకొక్క పది నిముషాలు" నిద్ర మత్తులోనే అనేసి పక్కకు తిరిగి పడుకున్నాడు.

సుధీర్ ఎనిమిదిన్నరకల్లా బయల్దేరుతాడు ఆఫీసుకు. ఆ లోపుగా టిఫిన్, వంట ముగిస్తుంది శమంత.

ఎన్నోసార్లు తన ఉద్యోగం గురించి భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటుంది. సుధీర్‌లాగే శమంత కూడా ఎమ్‌టెక్ చదివినా ఉద్యోగ విషయంలో ఐ.టి. కంపెనీలలో పనికన్నా కాలేజీలో లెక్చరర్‌గా చేరడానికే మొగ్గు చూపింది శమంత.

జీతం కాస్త తక్కువ వచ్చినా ఇంటి వ్యవహారాలు, పిల్లల చదువు వంటివి శమంత చూసుకోవడం వలన సుధీర్‌కు కాస్త ఒత్తిడి తగ్గింది.

సాయి పడుకున్న గదిలోనే ఇంకో మంచంమీద గాఢనిద్రలో వున్న అయిదేళ్ళ చంద్రవదన బుగ్గమీద ముద్దు పెట్టుకుని బయటకు వచ్చి బాల్కనీలోకి వచ్చింది శమంత.

అప్పటికే స్నానం ముగించినట్టు కనబడుతున్న వైదేహి బట్టలుపిండి ఆరవేస్తూండటం చూసి ఆశ్చర్యపోయింది శమంత.

"పొద్దున్నే నువ్వెందుకమ్మా బట్టలుతుకుతున్నావు? పని మనిషి వచ్చి వుతుకుతుందిగా! పైగా ఆ దుప్పట్లు పిండడం నీ వల్లవుతుందా? మొన్న నువ్వు వచ్చిన రోజునే కదమ్మా ఇస్త్రీ మడతలు విప్పి ఆ దుప్పటి మంచంమీద పరిచాను. అప్పుడే తడపడం దేనికి?" అంటూ ఆవిడ చేతిలోంచి తీసుకుని తను పిండి దండెం మీద ఆరేసింది శమంత.

శమంత మాటలకు కాస్త తొట్రుపడుతూ "అదీ... మంచినీళ్ళు త్రాగుతుంటే పరుపుమీద ఒలికిపోయాయి. అందుకని..." అంటూ మిగిలిన పాత చీరలు నాలుగూ నీళ్ళలో జాడించి ఆరవేయడంలో పడింది వైదేహి.

"నీళ్ళు పడితే దుప్పటి వుతకడం దేనికమ్మా? ఊరికే ఎండ తగిలేట్టు ఆరేస్తే పోయేది. అసలు మెత్తటి పరుపు మీద మళ్లీ ఆ పాత చీరలు పరచుకోవడం కొత్తగా మొదలుపెట్టావు" అంటున్న శమంతకు ఏం చెప్పాలో తెలియనట్టు మౌనం వహించింది వైదేహి. ఆవిడ ముఖంలో నీలినీడలు అలముకున్నాయి.

అదేమీ గమనించని శమంత వంటింట్లోకి వెళ్ళి పనిలో పడింది.

చందూ లేచి 'అమ్మా' అంటూ పిలుస్తుండడంతో మనవరాలి ధగ్గరకు వెళ్ళింది వైదేహి.

కొడుకు పిల్లలిద్దరూ తల్లితండ్రులను 'మమ్మీ' 'డాడీ' అని పిలుస్తారు. కోడలు రంజని వాళ్ళకు అలా నేర్పింది. శమంత మాత్రం 'అమ్మా నాన్న' అనే పిలుపులోని కమ్మదనం 'మమ్మీ డాడీ'కి ఎలా వస్తుంది అంటూ పిల్లలకి అలా పిలవడం అలవాటు చేసింది.

"నువ్వప్పుడే లాల పోసేసుకున్నావా అమ్మమ్మా?" అమ్మమ్మ చేతిలోకి ఒదిగిపోయిన చందు ఆవిడనుండి వస్తున్న చందనం సబ్బు వాసనను గాఢంగా పీల్చుకుని అడిగింది.

"అవునమ్మా... నువ్వూ పళ్ళు తోముకుని పాలు తాగేస్తే నీకూ లాల పోసేస్తాను... ఏం?" మనవరాలి బుగ్గమీద ముద్దు పెట్టుకుంది వైదేహి.

"నాకు నీ సబ్బుతో లాలపోస్తావా మరి?" ముద్దుగా షరతుపెట్టింది చందు.

అప్పటికే స్నానం ముగించి వచ్చిన సాయి చెల్లెల్ని వుడికిస్తూ... "ఛీ ఛీ నువ్వింకా పళ్ళుతోముకోలేదు, స్నానం చేయలేదు... వాసన ఒస్తున్నావు నన్ను ముట్టుకోకు" అంటూ దూరం పోయాడు.

చందు ఏడుపుఅందుకునేంతలో శమంత వచ్చి కూతుర్ని ఎత్తుకుని వెళ్ళింది.

ఉదయం తొమ్మిది గంటలయ్యేసరికి పిల్లలు స్కూలుకూ, కూతురూ అల్లుడూ ఉద్యోగాలకు వెళ్ళిపోయాక ఒక్కత్తే హాల్లో టి.వి. ముందు కూర్చుంది వైదేహి.

టి.వి.లో ఏదో కార్యక్రమం వస్తోంది గానీ వైదేహి మనసు దానిమీద లేదు.

భర్త సదానంద బ్రతికి వున్నంతవరకు ఆయనతోనే లోకంగా గడిచిపోయిందామె జీవితం. కొడుకు లోకేష్, కూతురు శమంత మంచి చదువులు చదివి, వెంటనే ఉద్యోగాలు సంపాదించుకోవడం జరిగింది. వాళ్ళిద్దరి పెళ్ళిళ్ళు కూడా సదానంద చేతిమీదుగానే జరిగాయి. అయితే మనవళ్ళకి, మనవరాళ్ళకీ ఊహ తెలియని వయసులోనే ఆయన దాటుకున్నాడు.

భర్త పోయినా తమ సొంత ఇంటిలో వనపర్తిలోనే వుంటుంది వైదేహి. ఈ నడుమ కొడుకు, కూతురు కూడా "ఎన్నేళ్ళు అలా ఒంటరిగా వుంటావమ్మా? మా దగ్గరికి వచ్చివుంటే మాకూ నిశ్చింత" అంటూ పదే పదే అంటుండడంతో ఆవిడ మనసులోనూ కొంత మార్పు వచ్చింది.

అదిగో ఆ ఆలోచనతోనే విజయవాడలోని కొడుకు దగ్గర ఒక నెల వుండి తరువాత కూతురి దగ్గరకొస్తానని ప్రయాణమైంది.

నెలరోజులు వుంటానని వెళ్ళిన తల్లి పదిరోజుల్లో హైద్రాబాదుకు బయల్దేరి రావడం శమంతకు ఆశ్చర్యమనిపించింది.



లోకేష్ భార్య రంజని చదువుతో బాటు సంస్కారంగల మనిషి. అందుకని వదిన సరిగ్గా చూడలేదని అమ్మ ప్రయాణమై వచ్చిందనుకోలేకపోయింది శమంత. అలాగే అమ్మ కూడా అనవసర విషయాలలో తలదూర్చడం, అడగని సలహాలివ్వడం, పెత్తనాన్ని మీద వేసుకోవడం చేయదని శమంతకు బాగా తెలుసు.

విషయం ఏమిటో నెమ్మదిగా ఆవిడే చెబుతుందిలే అనుకుని వూరుకుంది శమంత.

'రేపో ఎల్లుండో వనపర్తికి బయల్దేరి వెళ్ళాలి.

అప్పుడే వెళ్తానంటే శమంత బాధపడుతుంది. కానీ తప్పదు. వీళ్ళ ఇళ్ళలో వుండి ఏ పూట ఎలాగో అని భయపడుతూ, పిల్లల ముందు అవమాన పడితే ఎలా అని సిగ్గుపడుతూ గడపడం కన్న ఒంటరిగా తన ఇంట్లో తను పడివుండటం మేలు' అనిపించి వైదేహి కళ్ళు తడిసాయి. టి.వి. కట్టేసి వెళ్ళి గదిలో మంచం మీద పడుకుంది.

పొద్దున్న పరుపుమీద పరచిన దుప్పటి వుతకడం గుర్తుంచుకుని కాలేజీకి వెళ్ళే అంత హడావుడిలోనూ ఇంకో ఇస్త్రీ దుప్పటి తీసి తల్లి పడుకునే పరుపుమీద పరచి వెళ్ళింది శమంత.

అది చూడగానే ఆవిడకు మరీ దిగులుగా అనిపించింది.

శమంత, పిల్లలు సాయంత్రం అయిదింటికే ఇల్లు చేరారు. రాగానే పిల్లలకు తినడానికి ఏదో చేసి పెట్టి తల్లికి కాఫీ కలిపిచ్చింది శమంత. ఆవిడేదో పరధ్యానంగా, దిగులుగా వున్నట్టు అనిపించినా ఎందుకలా వున్నావని రొక్కించలేదు. రాత్రికి తీరికగా మాట్లాడుదాంలే అనుకుంటూ స్నానం చేసి వంట మొదలుపెట్టింది.

ఎనిమిది కావొస్తుండగా పిల్లలకి అన్నం పెట్టింది శమంత. సుధీర్ ఇంటికి రావడానికి తొమ్మిదవుతుంది. పెద్దవాళ్ళు ముగ్గురూ రాత్రి భోజనం ముగించేసరికి పది దాటుతుంది.

"నేనూ వాళ్ళతోబాటే తినేస్తానే" అంది వైదేహి.

'అల్లుడికి పెట్టకుండా నేనేలా తింటాను?' అనే అమ్మ ఇవాళ అలా అంటుంటే ఆశ్చర్యపోయింది శమంత.

"ఆలస్యంగా తింటే అరగదు. నిద్ర సరిగా రాదు... అందుకని" అన్నదావిడ సంజాయిషీ ఇస్తున్నట్టు.

"అదే మంచిపని అమ్మా. మాకయితే జీవనవిధానం అలా వుందిగనుక రాత్రి పొద్దుపోయాక తినాల్సి వస్తుంది. నిజానికి రాత్రి ఎనిమిదింటిలోపు

తినేయడం ఆరోగ్యానికి మంచిది" అంటూ అమ్మకూ కంచం పెట్టి వడ్డించింది శమంత.

రాత్రి పదిగంటలప్పుడు "అమ్మా ఐస్‌క్రీమ్" అంటూ కప్పు అందించింది శమంత తల్లికి.

"వద్దమ్మా! నిన్న రాత్రి ఇలా ఆలస్యంగా ఆ జ్యూస్ తాగాను..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయింది వైదేహి.

శమంత బలవంతం చేయలేదు. ఆ రాత్రి వదినకు ఫోను చేసి మాట్లాడింది.

"అత్తయ్యకు నామీద కోపమొచ్చిందా శమంతా? అలా హఠాత్తుగా ప్రయాణం పెట్టుకుంటే మా వలన ఏ పొరబాటు జరిగిందా అని మథన పడుతున్నాం" అనడిగింది రంజని.

"అదేం లేదు వదినా? అమ్మ ఆరోగ్యం బాగుంది కదా!" అంది శమంత.

"ఈ మధ్యన రాత్రి పూట రెండు రోజులు చెంబుతో నీళ్ళు తాగబోయి మంచంమీద వంపేసుకున్నారు. తడిసిన బట్టలు పనిమనిషికి వేయకుండా తానే వుతికారు. వయసు మీద పడుతోంది కదా చేయి పట్టు తప్పుతోందేమో" అంది రంజని.

ఫోను పెట్టేసాక శమంత ఆలోచనలో పడింది.

మర్నాడు వైదేహి కూతురి వెంటే తిరుగుతూ పనుల్లో సహాయపడింది. తల్లి ఏదో చెప్పాలని సంకోచపడుతున్నట్టు అర్థమైంది శమంతకు.

"ఏంటమ్మా? ఏమైనా మాత్రలు, మందులు కావాలా?" అనడిగింది.

"అది కాదమ్మా... నేను ఈ శనివారం ఊరికి వెడదామనుకుంటున్నాను. నీకు, అల్లుడికి కూడా ఆ రోజు సెలవే గనుక నన్ను బస్టాండుకు తీసుకెళ్ళడం ఇబ్బంది వుండదు" అంది వైదేహి నెమ్మదిగా.

"అదేమిటమ్మా? వచ్చి వారం కూడా కాలేదు... సరే సాయంత్రం మాట్లాడుకుందాం. రాత్రిపూట తిననన్నావుగా ఐస్‌క్రీమ్. మధ్యాన్నం మరచిపోకుండా తిను" అని చెప్పి బయల్దేరింది శమంత.

ఆరోజు సాయంత్రం ఆ ఊళ్ళోనే వున్న శమంత చిన్నాన్న కూతురు భర్తతో కలసి ఇంటికి వచ్చింది వైదేహిని చూసిపోవడానికి.

"బాగున్నావా పెద్దమ్మా? ఆరోగ్యం బాగుంది కదా?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

శమంత బలవంతం మీద వాళ్ళిద్దరూ రాత్రి భోజనానికి వుండిపోయారు. సుధీర్ ఇంటికి వచ్చాక అందరూ కలసి భోజనం చేసేసరికి పద కొండయ్యింది.

"అమ్మా నీకివాళ మళ్ళీ భోజనం ఆలస్యమయింది కదూ!" అంటూ గదిలోకి వచ్చిన శమంత తల్లి పాత చీరలు నాలుగు మడత పెట్టి పరుపుమీద వేయడం చూసి ఏదో అడగబోయి ఆగిపోయింది.

శమంత ఏమీ అనకముందే వైదేహి కంగారు పడుతూ "నడుము నొప్పిగా వుంటోంది. అందుకని నడుము క్రింద ఒత్తుగా వుంటే బాగుంటుందని వేసుకుంటున్నా" అంది సంజాయిషీ ఇస్తున్నట్టు.

మర్నాడు వుదయం శమంత లేచేసరికి ఆవిడ ఆ పాత చీరలన్నీ పిండి ఆరేసేసింది. గమనించినా గమనించనట్టే వుండిపోయింది శమంత.

ఆ సాయంత్రం ఇంటికి రాగానే పిల్లలకు తిండి పెట్టి ఆటలకు పంపించి తల్లి గదిలోకి వచ్చింది శమంత. శమంత ఆరోజు ఇంటికి వచ్చేముందు డాక్టర్ని కలిసి మాట్లాడింది.

"అమ్మా నేను పదేళ్ళదాక పక్క తడుపుకునేదాన్నని చెప్పేదానివి గుర్తుందా? ఆ పోలిక సాయికీ కాస్త వచ్చింది కదా. ఇప్పుడు ఆ సమస్య లేదులే" అంటూ తల్లి పక్కన కూర్చుంది.

వైదేహి ముఖంలో కళ తగ్గింది. నిశ్శబ్దంగా కూర్చుంది శమంత ఏమి చెప్పాలనుకుంటున్నదా అని ఆలోచిస్తూ.

"అమ్మా... చిన్నప్పుడు కొన్నాళ్ళు పిల్లలకు మూత్ర విసర్జన మీద నియంత్రణ వుండదు. అలాగే వయసు మీద పడ్డాక కొంత మందిలో 'ఇన్‌కాంటినెన్స్' అనే సమస్య వస్తుంది. పగలు ఫరవాలేదు గానీ నిద్రలో నాలుగు గంటలు గడిస్తే కంట్రోలు చేసుకోలేక పక్క తడుపుకుంటారు. ఇందులో సిగ్గుపడవలసిందీ, అవమాన పడవలసిందీ ఏమీ లేదు. పిల్లలకు డయాపర్లలాగా ముసలివారి కోసం ఈ ప్యాడెడ్ డ్రాయర్లు వచ్చాయి. రాత్రి పడుకునే ముందు ఇవి తొడుక్కుని పడుకుంటే కాస్త అటూ ఇటూ అయినా పక్క బట్టలు వుతుక్కోనక్కర్లేదు. అయినా నా దగ్గర నీకు మొహమాటమేమిటి? ఇంత దానికి ఊరికి వెళ్ళిపోతానని దిగులుపడాలా?" అంటూ తను తెచ్చిన డ్రాయర్లు తల్లికి ఇచ్చింది.

వైదేహి తల ఎత్తి శమంత ముఖంలోకి చూసింది. "ఇప్పుడు నువ్వు నాకు అమ్మలా కనబడుతున్నావు. నా సమస్యకు ఇంత సులువైన పరిష్కారం వుందని తెలియక ఎంతో అవమానంతో బాధ పడ్డాను. కోడలి ముఖం చూడలేక వచ్చేసాను" అంటూ శమంత భుజం మీద తల వాల్చింది.



## పాపులారిటీ కోసం...

ఈమధ్య 'మ్యాగ్జిమ్' మ్యాగజైన్ పుణ్యమాని కొంతమంది బాలీవుడ్ తారలకు తెగ పబ్లిసిటీ వచ్చేసింది. ఆ కోవలోకే రైమా సేన్ చేరిందిప్పుడు. మూన్ మూన్ సేన్ పెద్ద కూతురు, రియా సేన్‌కి అక్క అయిన రైమా సేన్ హిందీ సినిమాల్లో చాన్సులు అంతంత మాత్రంగానే వుండడంతో నలుగురి దృష్టిలోకీ రావడానికి 'మ్యాగ్జిమ్' ఆయుధాన్ని వాడిందిప్పుడు. ఈ మ్యాగజైన్ తాజా సంచికలో ఆమె పోజులు కుర్రకారుకి మంచి హుషారునిచ్చేవిగా వున్నాయని సినీజనాలు చెవులు కొరికేసుకుంటున్నారు. మరి రైమా లక్ష్యం ఎంతవరకూ నెరవేరుతుందో!